## కేకేఆర్‌పై ఘన విజయం

ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ మూడో అత్యధిక స్కోరు




07


మానేరు **జనత** ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

26.05.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 38 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# జపాన్‌ను అధిగమించాం

## 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్




02

మన జీడీపీ రూ.356 లక్షల కోట్లు

ఇదే వేగంతో వెళ్తే.. మూడేళ్లలో మూడో స్థానాన్నీ కైవసం చేసుకుంటాం

నీతిఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం వెల్లడి

గత పదేళ్లలో భారత్ తలసరి ఆదాయం

రెట్టింపైందని ఐఎంఎఫ్ వెల్లడి

జపాన్‌ను అధిగమించి భారత్.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత ధరల ప్రకారం భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,61,000 కోట్లు) కాగా.. జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,53,000 కోట్లు). నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం ఈ వివరాలను వెల్లడించారు.



# ప్రజలకు డబుల్ ఇంజన్ ప్రయోజనాలు

## ఆపరేషన్ సిందూర్.. మేడిన్ ఇండియా విజయం

ఉగ్ర పోరులో కీలక మలుపు..

ఇది కేవలం సైనిక చర్య కాదు భారత్ పరివర్తనకు నిదర్శనం: ప్రధాని

ఎన్డీయే సీఎంలు, డిప్యూటీ సీఎంల భేటీలో మోదీ



02

దేశంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు సమర్థవంతంగా చేర్చాలని ప్రధాని మోదీ సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నమునాకు అనుగుణంగా దేశంలో కులగణన జరుగుతుందని తెలిపారు. సమాజంలో అభివృద్ధి ఫలాలు చేరని వారిని, అణగారిన వారిని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు త్వరలో చేపట్టబోయే కులగణనతో ముందడుగు పడుతుందని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో మోదీ అధ్యక్షతన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది.

## యాదగిరీశుడి క్షేత్రంలో అపశ్రుతి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు భక్తుల మృతి

తేనెటీగల దాడిలో కొందరు భక్తులకు గాయాలు



.. వివరాలు 2లో

## టీజీఈసెట్‌లో 93.87% ఉత్తీర్ణత






## సాగునీటి రంగంలో సర్కార్ విఫలం

అనుమతుల్లేకుండా గోదావరి-బనకచర్ల నిర్మాణం

కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఏం చేస్తున్నారు?: హరీశ్

**ప్రజా దీవెన, జనతా న్యూస్:** కాంగ్రెస్ హయాం లో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, సాగునీటి ప్రయోజనాలు కాపాడటంలో సీఎం రేవంత్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి హరీశ్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు

మిగతా 2 లో

## ఈడీ కేసు వల్లే రేవంత్ మోదీని కలిశారా?

మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై దర్యాప్తు చేయాలి: కేటీఆర్



## ఆదాయం వచ్చే పరిశ్రమలు రాష్ట్రం దాటొద్దు



02

ప్రతి శనివారం ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సబ్ కమిటీ భేటీ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హ్యుందాయ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆమోదం



## పందేలు లేని పేకాట తప్పుకాదు

వినోదం కోసం ఆడటం నైతిక ఉల్లంఘన కాదు

కర్ణాటక వ్యక్తి కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



## వర్షాలకు ఢిల్లీ అతలాకుతలం

గంటకు 82 కి.మీ వేగంతో గాలులు.. 200 విమానాలపై ప్రభావం

ఏసీపీ కార్యాలయం పైకప్పు కూలి పోలీసు అధికారి దుర్మరణం

రోడ్లపై నీళ్లు.. మునిగిన వాహనాలు.. లోతట్టు ప్రాంతాలు జలమయం

కేరళలోనూ వర్షాల ఉధృతి.. మహారాష్ట్రను తాకిన రుతుపవనాలు

రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు.. యెల్లో అలెర్ట్ జారీ

02




## కొచ్చి తీరంలో హై అలెర్ట్

కంటెయినర్లతో మునిగిన లైబేరియా నౌక

కొన్నింటిలో ప్రమాదకర రసాయనాలు

## భక్తులతో కిక్కిరిసిన కాళేశ్వర క్షేత్రం

పుష్కరాల 11వ రోజున 3.50 లక్షల మంది రాక

నియంత్రణలో అధికారుల వైఫల్యం

శివయ్య దర్శనం కోసం భక్తుల పడిగాపులు

మంచినీరు, నిలువ నీడ లేక ఇక్కట్లు

అధికారుల వైఫల్యంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం

పుణ్యస్నానం ఆచరించిన గవర్నర్ దంపతులు

03






# జపాన్‌ను అధిగమించాం

## 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**మన జీడీపీ రూ.356 లక్షల కోట్లు ఇదే వేగంతో వెళ్తే..**

**మూడేళ్లలో మూడో స్థానాన్నీ కైవసం చేసుకుంటాం**

**నీతిఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం వెల్లడి**

**గత పదేళ్లలో భారత్ తలసరి ఆదాయం రెట్టింపైందని ఐఎంఎఫ్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 25: జపాన్‌ను అధిగమించి భారత్.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత ధరల ప్రకారం భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,61,000 కోట్లు) కాగా.. జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,53,000 కోట్లు). నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం ఈ వివరాలను వెల్లడించారు. 'భారత్ జపాన్‌ను దాటేసింది. ఐంఎఫఎఫ్ గణాంకాల ఆధారంగా దీనిని తెలియజేస్తున్నా. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థలు. మన ప్రణాళికలకు అనుగుణంగా మన వృద్ధి కొనసాగితే.. మరో రెండున్నర లేదా మూడేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తాం' అని తెలిపారు. కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఎంఎఫ్ విడుదల చేసిన 'వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్' నివేదికలో 2025లో భారత్ 4.19 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి.. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేసింది. దీనికి తగినట్లుగానే, కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారత్ 4వ స్థానానికి చేరుకోవటం విశేషం. గత పదేళ్లలో భారత్‌లో తలసరి ఆదాయం రెట్టింపు అయ్యిందని, 2013-14లో తలసరి ఆదాయం 1,438 డాలర్లు (రూ.1,22,476) కాగా, 2025 నాటికి 2,880 డాలర్లకు (రూ.2,45,293) పెరిగిందని ఐఎంఎఫ్ ఆ నివేదికలో తెలిపింది. 2025లో భారత్ 6.2 శాతం వృద్ధిరేటును కొనసాగిస్తుందని, ఇది అంతకుముందు అంచనా వేసిన 6.5 శాతం కన్నా తక్కువని పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలే దీనికి కారణమని విశ్లేషించింది. 2025లో ప్రపంచం ఆర్థిక వృద్ధి రేటు 2.8 శాతం ఉండే అవకాశం ఉందని, ఇది గతంలో అంచనా వేసిన దానికంటే 0.5 శాతం తక్కువని పేర్కొంది. కాగా, 'వికసిత్ భారత్ కోసం వికసిత్ రాజ్యం-2047' పేరుతో నీతిఆయోగ్ రూపొందించిన పత్రంలో 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల (రూ.25 కోట్ల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని పేర్కొన్నారు. తలసరి ఆదాయంలో.. సంపన్న దేశాలతో భారత్ సరితూగుతుందని తెలిపారు.

# సాగునీటి రంగంలో రేవంత్ సర్కార్ విఫలం




మొదటి పేజీ తరువాయి

నిర్మాణం వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లుతుందని, గోదావరి జలాలను ఏపీకి తరలించుకుపోయే కుట్ర జరుగుతుంటే రేవంత్ మౌనంగా ఉండటం తగదన్నారు. ఏ అనుమతులు లేని గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చేపట్టవద్దని, ఈ అంశంపై నీతిఆయోగ్ సమావేశంలో సీఎం ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. రాష్ట్రానికి నష్టం కలిగించే విధంగా జలదోపిడీకి ప్రయత్నిస్తుంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

**పదవుల కోసం విలువల్ని వదిలేస్తున్న కాలమిది**

పదవులు, హోదాల కోసం విలువలను వదిలేసి, అవసరమైతే ఎవరినైనా తొక్కుకుంటూ ముందుకు వెళ్లడానికి సిద్ధపడుతున్న ఈ రోజుల్లో తెలంగాణ ఉద్యమం కోసం ప్రిన్సిపాల్ పదోన్నతిని త్యాగం చేసిన నిజాయితి నందిని సిధారెడ్డి సొంతమని హరీశ్ కొనియాడారు. కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి 70 వసంతాల సందర్భంగా ఏడు పదుల వెన్నెల పేరుతో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన అభినందన సభకు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు డబుల్ ఇంజన్ ప్రయోజనాలు అందాలి




**ఆపరేషన్ సిందూర్..**

**మేడిన్ ఇండియా విజయం**

**ఉగ్ర పోరులో కీలక మలుపు..**

**ఇది కేవలం సైనిక చర్య కాదు భారత్ పరివర్తనకు నిదర్శనం: ప్రధాని**

**ఎన్డీయే సీఎంలు, డిప్యూటీ సీఎంల భేటీలో మోదీ**

**న్యూఢిల్లీ, మే 25 :** దేశంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు సమ-ర్థవంతంగా చేర్చాలని ప్రధాని మోదీ సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నమునాకు అనుగుణంగా దేశంలో కులగణన జరుగుతుందని తెలిపారు. సమాజంలో అభివృద్ధి ఫలాలు చేరని వారిని, అణగారిన వారిని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు త్వరలో చేపట్టబోయే కులగణనతో ముందడుగు పడుతుందని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో మోదీ అధ్యక్షతన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. 20 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మోదీ నాయకత్వంలో మన సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించి, పాకిస్థాన్‌కు గట్టి గుణ-పాఠం చెప్పడాన్ని సమావేశం అభినందించింది. దేశంలో చరిత్రాత్మక రీతిలో కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయించడాన్నీ కొనియాడింది. ఈ మేరకు సమావేశం తీర్మానాలను ఆమోదించింది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ఆపరేషన్ సిందూర్.. మేడిన్ ఇండియా విజయం**

'ఆపరేషన్ సిందూర్' టెర్రరిజంపై పోరులో కీలక మలుపుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'మేడిన్ ఇండియా' ఆయుధాలు, వ్యవస్థలు దీని విజయంలో కీలక భూమిక నిర్వహించాయన్నారు. 'ఇవాళ దేశం మొత్తం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమైంది. భారత్ అసలు బలం ఇదే. ఈ సందర్భంగా దేశవాసులందరినీ ఒకటి కోరుతున్నాను. అవకాశం ఉన్న చోట.. మన జీవనావసరాలకు దేశీయంగా ఉత్పత్తి అయ్యే వస్తువులను మాత్రమే వాడదామని అందరం ప్రతిజ్ఞ చేద్దాం' అని పిలుపిచ్చారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రధాని 'మన్ కీ బాత్' ప్రసంగం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆదివారం 122వ సంచికలో పాకిస్థాన్, దాని ప్రేరిత ఉగ్రవాదులపై 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉపముఖ్యమంత్రులు, నేతలు ఢిల్లీలో మూకుమ్మడిగా ఈ కార్యక్రమం విన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి 'మన్ కీ బాత్'లో మోదీ మాట్లాడారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లో భారత సైన్యం నాశనం చేసిన ఉగ్రవాద స్థావరాల ఫొటోలను ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. ప్రధానంగా పీవోకేలో ధ్వంసమైన గుల్పూర్, అబ్బాస్, బర్నాలా క్యాంపుల గురించి ప్రస్తావించారు. జమ్మూకశ్మీరులోని రాజౌరీ, పూంచ్‌లలో కార్యకలాపాలు నిర్వహించే లష్కరే తయ్యబా టెర్రరిస్టులకు గుల్పూర్ శిబిరం ప్రధాన స్థావరం. అబ్బాస్... లష్కరే ఆత్మాహుతి బాంబర్ల శిక్షణకు సంబంధించిన కీలక కేంద్రం.

ఆయుధ శిక్షణ, ఐఈడీల తయారీని బర్నాలాలో నేర్పుతారు. ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు కచ్చితత్వంతో దాడియడం అసాధారణమని మోదీ అన్నారు. 'మన ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది, ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరి శ్రమకూ ఈ విజయం చిహ్నం. ఆపరేషన్‌సిందూర్ యావజ్జాతిలో దేశభక్తి భావన చొప్పించింది' అని చెప్పారు. 'ఆపరేషన్ విజయవంతానికి.. ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తితో దేశీయంగా పెరిగిన రక్షణ సామర్థ్యం ప్రధాన కారణం. దేశీయంగా రూపుదిద్దుకున్న ఆయుధాలు, టెక్నాలజీ శక్తికి మన సైనికుల శౌర్యం తోడయింది. ఆపరేషన్ సిందూర్.. స్థానికత కోసం గళమెత్తేందుకు (వోకల్ ఫర్ లోకల్') సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇది దేశభక్తిని ఇనుమడింపజేయడమే గాక.. స్వావలంబన స్ఫూర్తిని కూడా బలోపేతం చేసింది. మనందరం ఒక్క అడుగు ముందుకేస్తే భారత పురోగతికి పెద్దఎత్తున తోడ్పడుతుంది' అని మోదీ ఉద్ఘాటించారు. 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమంలో భాగంగా చాలా మంది భారతీయులు.. తమ సెలవు దినాలను దేశీయంగానే గడపాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. పలువురు యువత భారత్‌లోనే పెళ్లి చేసుకుంటామని అంటున్నారన్నారు. టర్కీ నగరం ఇస్తాంబుల్ నగరం అంతర్జాతీయంగా పెళ్లిళ్లకు పెట్టింది పేరు. అయితే, ఆ దేశం ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు మద్దతివ్వడంతో టర్కీని బాయ్‌కాట్ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది ఈ నేపథ్యంలో మోదీ విదేశాల్లో పెళ్లిళ్ల అంశాన్ని ప్రస్తావించడం విశేషం.

# వర్షాలకు ఢిల్లీ అతలాకుతలం

**గంటకు 82 కి.మీ వేగంతో గాలులు..**

**200 విమానాలపై ప్రభావం**

**ఏసీపీ కార్యాలయం పైకప్పు కూలి పోలీసు అధికారి దుర్మరణం**

**రోడ్లపై నీళ్లు.. మునిగిన వాహనాలు.. లోతట్టు ప్రాంతాలు జలమయం**

**కేరళలోనూ వర్షాల ఉధృతి.. మహారాష్ట్రను తాకిన రుతుపవనాలు**

**రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు.. యెల్లో అలెర్ట్ జారీ**

**2-3 రోజుల్లో ఏపీకి నైరుతి.. రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం**

న్యూఢిల్లీ, మే 25: కుండపోత వర్షాలతో దేశ రాజధాని నగరం ఢిల్లీ అతలాకుతలమైంది. శనివారం అర్ధరాత్రి దాటాక మొదలై.. ఆదివారం ఉదయం వరకు తెరిపినివ్వకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపించగా.. వాహనాలు నీట మునిగాయి. ఉరుములతో కూడిన వర్షానికి తోడు.. గంటకు 82 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో.. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 200 విమానాలపై తీవ్ర ప్రభావం కనిపించింది. 49 విమానాలు రీ-షెడ్యూల్ అవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. విమానాశ్రయం టెర్మినల్-1 వద్ద పైకప్పు దెబ్బతిని, వర్షపునీరు లీకవుతోంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎన్‌సీఆర్-ఢిల్లీ వ్యాప్తంగా భారీ వర్షాల ప్రభావం కనిపించింది. చాలా చోట్ల విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడింది. పలు కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

అండర్‌పాసలు, రహదారులపై మోకాలి లోతు మొదలు.. ఐదారు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. వాహనాలు నీట మునిగాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఢిల్లీలోని పోలీసు అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పైకప్పు కూలడంతో.. ఓ అధికారి దుర్మరణం పాలయ్యారు. నగరంలోని చాలా చోట్ల 5-8 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి కూడా ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు.. గంటకు 70-80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న కుండపోత వర్షాలతో కేరళలో జనజీవనం స్తంభించిపోయింది. కోళికోడ్‌లో చెట్టు కూలి ఓ వృద్ధుడు మృతిచెందాడు. కాగా.. నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర, గోవాలను తాకినట్లు వాతావరణ శాఖ తెలిపింది.





## ఆదాయం వచ్చే పరిశ్రమలు రాష్ట్రం దాటొద్దు

**ప్రతి శనివారం ఇన్వెస్టమెంట్ ప్రమోషన్ సబ్ కమిటీ భేటీ**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హ్యుందాయ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆమోదం**

**హైదరాబాద్, మే 25 :** తెలంగాణ యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఇండస్ట్రియల్ ప్రమోషన్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్, ఇప్పటికే చేసుకున్న ఎంవోయూల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఒక పరిశ్రమ స్థాపిస్తే దానికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని, వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇకనుంచి ప్రతి శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్టమెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని చెప్పారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవల్‌పమెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో రూ.8528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయంగా సబ్ కమిటీ అభిప్రాయపడింది. రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో 4276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు.

# భక్తులతో కిక్కిరిసిన కాళేశ్వర క్షేత్రం

**పుష్కరాల 11వ రోజున 3.50 లక్షల మంది రాక**

**15 కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్**

**నియంత్రణలో అధికారుల వైఫల్యం**

**శివయ్య దర్శనం కోసం భక్తుల పడిగాపులు**

**మంచినీరు, నిలువ నీడ లేక ఇక్కట్లు**

**అధికారుల వైఫల్యంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం**

**పుణ్యస్నానం ఆచరించిన గవర్నర్ దంపతులు**



**భూపాలపల్లి, మే 25 :** త్రివేణి సంగమమైన కాళేశ్వర క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తడంతో సరస్వతీ పుష్కరాల 11వ రోజున ఘాట్లతో పాటు కాళేశ్వరం వీధులు జనమయమయ్యాయి. ఆదివారం సుమారు 3.50 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే వరుసగా రెండో రోజు కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పుష్కరస్నానాల కోసం వచ్చిన భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్లు, ముక్తీశ్వరాలయం వరకు అరిగోస పడ్డారు. వీఐపీల తాకిడి అధికం కావడంతో అధికార యంత్రాంగమంతా వారి సేవలో తరించడం, సామాన్య భక్తుల ఇక్కట్లను పట్టించుకునేవారు లేకపోవడంతో అంతా గందరగోళంగా మారింది. చాలామంది భక్తులు పుష్కర స్నానానికి పరిమితమై శివయ్యను దర్శించుకోకుండానే అసంతృప్తితో ఇంటి ముఖం పట్టారు. పుష్కరాల గడువు మరో 24 గంటల్లో ముగియనున్న నేపథ్యంలో ఆదివారం భక్తుల సంఖ్య భారీగా ఉండవచ్చని అధికార యంత్రాంగం ముందుగానే అంచనా వేసినా తాగునీరు, నీడ వసతిని కూడా కల్పించలేకపోయింది.

ఉదయం నుంచి సాయంత్రం వరకు శివయ్య దర్శనం కోసం నిరీక్షించిన చాలామంది భక్తులు ఆకలితో వెనుదిరిగారు. అన్నప్రసాద వితరణలోనూ దేవాదాయ శాఖ విఫలమైందని భక్తులు మండిపడ్డారు. మరోవైపు.. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు 15కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దీనికి తోడు ప్రైవేటు వాహనాలను ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు, పుష్కర ఘాట్ల వరకు అనుమతించడం సమస్య తీవ్రతను మరింత పెంచింది. చాలామంది భక్తులు మహారాష్ట్ర వైపు పుణ్యస్నానాలు చేసి శివుడిని దర్శించుకోకుండానే తిరిగి వెళ్లిపోయారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో వీఐపీల సేవలో తరించిన అధికారులు.. సామాన్యులను పట్టించుకోకపోవడం విమర్శలకు దారి తీసింది. ట్రాఫిక్ నియంత్రణలో వైఫల్యంపై మంత్రి శ్రీధర్‌బాబు జిల్లా ఎస్పీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గవర్నర్ దంపతుల పుష్కరసాన్నం**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పుష్కర సాన్నమాచరించి సరస్వతీ మాతకు చీర, సారె సమర్పించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. వారి వెంట మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ ఉన్నారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎంపీ నామ్‌దేవ్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తన కుటుంబసభ్యులతో కలిసి పుష్కరస్నానాలు ఆచరించారు.

## ఈడీ కేసు వల్లే రేవంత్ మోదీని కలిశారా?

**మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై దర్యాప్తు చేయాలి: కేటీఆర్**

**హైదరాబాద్, మే 25 :** కేంద్రం పరిధిలోని నీతి ఆయోగ్ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం బహిష్కరిస్తుందన్న సీఎం రేవంత్ రెడ్డి మొన్నటి భేటీకి హాజరుకావడం వెనుక ఆంతర్యం ఏమిటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో రేవంత్ పేరును చేర్చడంవల్లే ఆయన మోదీని ప్రత్యేకంగా కలుసుకున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కావడమే కాకుండా.. ప్రధానితో రేవంత్ రెడ్డి సరదాగా గడుపుతూ కనిపించారని, ఏం అద్భుతం జరిగిందో? అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా... ప్రపంచ సుందరి అందాల పోటీల నేపథ్యంలో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒక ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి అనుభవాలు జరగకూడదని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందని, వారికి అవమానం జరిగితే ఈ రాష్ట్రం అంగీకరించదన్నారు.

## ఉగ్రదాడులకు ప్రతి దాడి తప్పదు

**రాహుల్ ఎవరి వైపు మాట్లాడుతున్నారు?: కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్, మే 25 :** ఉగ్రదాడుల్లో ప్రజలు చనిపోతే నివాళులర్పించే విధానానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్వస్తి పలికిందని.. దాడి చేస్తే ప్రతి దాడి తప్పదని.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఒకరిని చంపితే వంద మందిని చంపుతామని చూపించామని తెలిపారు. ప్రధాని మోదీ మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌ను ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు, బీజేపీ నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటనలను చూస్తే.. ఆయన మన సాయుధ దళాల స్థైర్యాన్ని బలహీనపరచడానికి, స్వదేశీకరణ ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని అర్థమవుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇతర దేశాల డ్రోన్లను ప్రశంసించడం నుంచి రాఫెల్ కొనుగోలును ఒక కుంభకోణంగా మాట్లాడటం వరకు.. అగ్నివీర్‌ను విమర్శించడం నుంచి మేక్ ఇన్ ఇండియా ప్రయత్నాలను దెబ్బతీయడం వరకు రాహుల్ ఎప్పుడూ భారత్ తరఫున మాట్లాడలేదని స్పష్టం చేశారు. మరి ఆయన ఎవరి తరఫున మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

**కేటీఆర్ ఆధిపత్యంపైనే కవిత లేఖాస్త్రం**

బీఆర్ఎసలో కేటీఆర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు కవిత లేఖాస్త్రాన్ని సంధించిందని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. కేసీఆర్ ప్రతిపాదిస్తున్న కేటీఆర్‌ను కవిత సవాలు చేస్తూ, కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించనని చెప్పకనే చెబుతున్నారని అన్నారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కవిత స్థాపించే రాజకీయ పార్టీతో ఒరిగేదేమీ ఉండదని, అస్తిత్వం కోసమే ఆమె ఆరాటపడుతోందని తెలిపారు. కాగా, 'కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందా..?' నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ స్పష్టం చేయాలని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఒకవైపు చర్చ జరుగుతుంటే, మరోవైపు ప్రాజెక్టు పునరుద్ధరణ ఖర్చును ప్రభుత్వమే భరించాలని కాంట్రాక్టు సంస్థలు లేఖ రాయడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

## యాదగిరీశుడి క్షేత్రంలో అపశ్రుతి

**వేర్వేరు ఘటనల్లో ఇద్దరు భక్తుల మృతి**

**తేనెటీగల దాడిలో కొందరు భక్తులకు గాయాలు**

**యాదాద్రి, మే 25 :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల్లో ఆదివారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన రామసాహు(60) కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు కుటుంబంతో కలిసి ఆయన యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చారు. క్యూలైన్లో వేచిఉన్న రామసాహు ఒక్కసారిగా అస్వస్థతకు గురై.. స్పృహ కోల్పోయారు. వెంటనే కొండపైనే ఉన్న ఆస్పత్రికి ఆయన్ను తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం అంబులెన్స్‌లో భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మరో ఘటనలో.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం.. గుట్ట కింద గల లక్ష్మీపుష్కరిణిలో స్నానం చేస్తుండగా ఆవీర్ అనే ఏడేళ్ల బాలిక ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగింది. కొద్దిసేపటికి చిన్నారిని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను బయటకు తీశారు. హుటాహుటిన బాలికను తొలుత యాదగిరిగుట్టలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే బాలిక మృతి చెందినట్లు చెప్పారు. అదేరోజు గుట్ట వద్ద భక్తుల్లో కొందరిపై తేనెటీగలు దాడి చేశాయి. కొందరు భక్తులు ఓ చెట్టు కింద కూర్చోగా తేనెటీగలు రావడంతో వారంతా తలోదిక్కున పరుగులు తీశారు. తేనెటీగల దాడిలో హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన యాదగిరి, పుష్పలత, శ్రావణి, అరవింద్, రుత్విక్ గాయపడ్డారు. వారిని వెంటనే భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.కాగా ఆదివారం కావడంతో యాదగిరిగుట్టకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. ఆదివారం 67వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.74,33,486 ఆదాయం సమకూరిందని ఈవో వెంకట్రావు తెలిపారు.

## వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా మజ్లిస్ నిరసన

**కంచన్‌బాగ్ వద్ద**

**పాల్గొన్న అక్బరుద్దీన్ ఒవైసీ**



హైదరాబాద్, మే 25 : రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేసిన వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ), మజ్లిస్ పార్టీల పిలుపు మేరకు హైదరాబాద్‌లో ఆదివారం పలుచోట్ల మానవ హారాలు జరిగాయి. ఇందులో పాల్గొన్న వేలాది మంది ముస్లింలు నిరసన తెలిపారు. ఒక చేత్తో జాతీయ జెండా, మరో చేతిలో నల్లజెండాలు ప్రదర్శించారు. 'వక్ఫ్ బచావో దస్తూర్ బచావో (వక్ఫ్‌ను కాపాడాలి- రాజ్యాంగాన్ని కాపాడాలి)' అన్న ప్లకార్డులతో యువకులు నినాదాలు చేశారు. కంచన్‌బాగ్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకూ ఏర్పాటైన మానవ హారంలో అసెంబ్లీలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు.



# పందేలు లేని పేకాట తప్పుకాదు

**వినోదం కోసం ఆడటం నైతిక ఉల్లంఘన కాదు**


**కర్ణాటక వ్యక్తి కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, మే 25:** పందేలు, జూదం మాట లేకుండా వినోదం, విలాసం కోసం పేకాట ఆడటం తప్పుకాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది నైతిక ఉల్లంఘన కిందకు రాదని స్పష్టం చేసింది. కర్ణాటకలో ప్రభుత్వ పింగాణి ఫ్యాక్టరీ ఉద్యోగుల హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డు డైరెక్టర్ వైసీ హనుమంతరాయప్ప కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హనుమంతరాయప్పతో పాటు కొందరు రోడ్డు పక్కన కూర్చుని పేకాడ ఆడుతుండగా, ఎటువంటి విచారణ లేకుండా రూ.200 జరిమానా వేశారని పేర్కొంది. కాగా హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో హనుమంతరాయప్ప చేతిలో ఓడిపోయిన రఘునాథ్ సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసి, గ్యాంబ్లింగ్ యాక్ట్‌లో శిక్షార్హుడు అయినందున ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరారు. దీంతో ఆయన ఎన్నికను రద్దు చేశారు. దీనిపై హనుమంతరాయప్ప కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా, ఎన్నిక రద్దు నిర్ణయాన్ని సమర్థించింది. దీనిపై సుప్రీం కోర్టులో ఆయన సవాల్ చేశారు. సుప్రీం కోర్టు ధర్మాసనం ఇటీవల ఈ కేసును విచారించి తీర్పును వెలువరించింది. 'ప్లే కార్డులకు చాలా రూపాలు ఉన్నాయి. ప్రతి ఆటలోనూ ముఖ్యంగా వినోదం కోసం ఆడినపుడు నైతిక ఉల్లంఘన జరిగిందని అంగీకరించలేం. మన దేశంలో చాలా ప్రాంతాల్లో పందేలు, జూదం ప్రస్తావన లేకుండా సాధారణంగా కార్డులు ఆడటం పేదవాడి వినోద వనరుగా భావిస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. హనుమంతరాయప్ప పందేలు ఆడే అలవాటున్న జూదగాడు కాదని పేర్కొంటూ, పేకాట ఆడారనే కారణంతో ఆయన ఎన్నికను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కొనసాగించలేమని, ఆయన ఎన్నికను పునరుద్ధరించాలని ఆదేశించింది.

# కొచ్చి తీరంలో హై అలెర్ట్

**కంటెయినర్లతో మునిగిన లైబేరియా నౌక**

**కొన్నింటిలో ప్రమాదకర రసాయనాలు**





**కొచ్చి, న్యూఢిల్లీ, మే 25:** కొచ్చికి సమీపంలో కంటెయినర్ల నౌక మునిగిపోవడంతో కోస్ట్‌గార్డ్, కేరళ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మునిగిన కొన్ని కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు ఉండడంతో కొచ్చి తీరంలో హైఅలెర్ట్ ప్రకటించాయు. ఒడ్డుకు కొట్టుకువచ్చే కంటెయినర్లనుగానీ, చమురుతెట్టునుగానీ తాకకూడదని ప్రజలను హెచ్చరించాయి. ఆఫ్రికా ఖండంలోని లైబేరియా దేశానికి చెందిన ఆ సరకు రవాణా నౌక ఆదివారం ఉదయం 7.50 గంటల సమయంలో అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిని ఇండియన్ కోస్టు గార్డు కాపాడింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిలో 21 మందిని శనివారమే కోస్టు గార్డ్ కాపాడింది. సహాయ చర్యల నిమిత్తం మిగిలిన ముగ్గురు సీనియర్ సిబ్బంది నౌకపైనే ఉండిపోవాల్సి వచ్చింది. నౌక మునిగిపోక తప్పదని స్పష్టం కావడంతో భారత నేవీకి చెందిన ఐఎన్ఎస సుజాత నౌక ఆదివారం వారిని కాపాడింది. 180మీటర్ల పొడవున్న ఆ నౌకలో మొత్తం 640 కంటెయినర్లు ఉన్నాయి. అవన్నీ సముద్రంలో మునిగిపోయినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నట్టు పేర్కొంది.

# టీజీఈసెట్‌లో 93.87% ఉత్తీర్ణత

**హైదరాబాద్, మే 25 :** ఇంజనీరింగ్ డిగ్రీలో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆదివారం ఉస్మానియా వర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, ఉస్మానియా వర్సిటీ వీసీ ఆచార్య ఎం.కుమార్, టీజీఈసెట్ కన్వీనర్ ఆచార్య పి.చంద్రశేఖర్ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 18,928 మంది పరీక్షకు హాజరుకాగా 17,768 (93.87శ) మంది ఉత్తీర్ణులయినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈసీఈలో 4,774 మంది, సీఎస్ఈలో 4,522 మంది, ట్రిపుల్‌ఈలో 3,719, సివిల్ 2389, మెకానికల్‌లో 1,813, మైనింగ్‌లో 232, కెమికల్ ఇంజనీరింగ్‌లో 85 మంది ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు. కాగా టీజీఈసెట్-2025లో వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ బ్రాంచ్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. కళాశాల విద్యార్థులు గొల్ల శ్రీశైలం రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, గొల్ల స్వామి 62వ ర్యాంకు, పి.అక్షయ 95వ ర్యాంకు, డి.అక్షయ్‌రెడ్డి 103వ ర్యాంకు, ఎం.పృథ్వీరాజ్ 158వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీందర్, లెక్చరర్లు అభినందించారు.

**డీఈఈసెట్‌కు 77.5%హాజరు**

డిప్లొమా ఇన్‌ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సులకు సంబంధించిన డీఈఈసెట్ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో జరిగిన ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 183 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. 43,615 మంది దరఖాస్తు చేసుకోగా 33,821 (77.54శ) మంది హాజరైనట్టు కన్వీనర్ జి.రమేష్ తెలిపారు. పరీక్షలకు తెలుగు మీడియం విద్యార్థులు 15,476, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం విద్యార్థులు 18,345 మంది హాజరయ్యారయ్యారని, పరీక్ష ఫలితాలను జూన్5లోపు ప్రకటిస్తామన్నారు.

# భారత్‌లో త్వరలో స్టార్‌లింక్ సేవలు ప్రారంభం..

## యూజర్ చార్జీలు ఇవేనా




ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్‌తో పాటు ఇతర గ్లోబల్ శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థలు భారత్‌లో తమ సర్వీసులు ప్రారంభించేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. భారత్ మార్కెట్‌కు అనుగుణంగా అత్యంత తక్కువ ధరకే అన్‌లిమిటెడ్ డేటా ప్యాకేజీలు అందించేందుకు శాట్‌కామ్ సంస్థలు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ప్రారంభ డాటా ప్లాన్ ధర రూ.840కు మించి ఉండకపోవచ్చని కూడా చెబుతున్నారు. ఇందుకు సంబంధించి జాతీయ మీడియాలో విస్తృత కథనాలు వెలువడుతున్నాయి. భారత్‌లో స్పెక్ట్రమ్ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ అధిక కస్టమర్ బేస్ సాయంతో ఖర్చుల భారం తగ్గించుకోవాలని సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

**ట్రాయ్ నిబంధనల ప్రకారం,**

ప్రస్తుతం నెలవారీ అర్బన్ యూజర్ చార్జీ రూ.500. ఇది కాక శాట్‌కామ్ సంస్థలు ఏజీఆర్‌పై 4 శాతం లెవీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఒక మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌కు 8 శాతం చొప్పున వార్షిక ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో, సంప్రదాయిక సర్వీసుల కంటే శాటిలైట్ సర్వీసులు ఖరీదైన వ్యవహారంగా మారాయి. ఇలా రకరకాల ఖర్చుల భారం తమపై ఉన్నప్పటికీ అంతర్జాతీయ శాట్‌కామ్ సంస్థలు మాత్రం వెనక్కుతగ్గట్లేదు. నిధుల లభ్యత సమృద్ధిగా ఉన్న స్టార్ లింక్ లాంటి సంస్థలు ఈ ఖర్చుల భారం తగ్గించుకునేందుకు కొత్త వ్యూహాలతో ముందుకు వెళుతున్నాయి.

"స్పెక్ట్రమ్ కర్చు ఇంత ఎక్కువగా ఉన్నా ప్రారంభ ధర మాత్రం 10 డాలర్ల లోపే ఉండే అవకాశం ఉంది. వీలైనంత మంది కస్టమర్లను చేర్చుకుని స్పెక్ట్రమ్ భారం తగ్గించుకునేందుకు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయని" ఓ కన్సల్టింగ్ సంస్థ అధికారి వ్యాఖ్యానించారు.

భారత్‌లో కార్యకలాపాలకు సంబంధించి స్టార్‌లింక్ కొన్ని సాంకేతికపరమై సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ప్రస్తుతం సంస్థకు భూసమీప కక్ష్యలో పరిభ్రమిస్తున్న 7 వేల శాటిలైట్లు ఉన్నాయి. వీటితో ప్రపంచవ్యాప్తంగా 4 మిలియన్ యూజర్లకు సేవలు అందించే అవకాశం ఉంది. ఇది భారత వినియోగదారుల అవసరాలకు ఏమాత్రం సరిపోదు. స్టార్‌లింక్ శాటిలైట్‌ల సంఖ్య 18 వేలకు చేరుకున్నా కూడా 1.5 మిలియన్‌ల మందికి మాత్రమే శాటిలైట్ సేవలు లభించే అవకాశం ఉంది. అదనపు శాటిలైట్లు ప్రయోగించేందుకు స్టార్‌లింక్‌కు ప్రభుత్వం సంస్థ ఇన్‌స్పేస్ అనుమతులు కూడా అవసరం. ఇందుకోసం కొంత సమయం పట్టే అవకాశం కూడా ఉంది. దేశంలోని ప్రైవేటు సంస్థలకు ఇన్ స్పేస్ అనుమతులు జారీ చేస్తుంటుంది.

అంతర్జాతీయ సంస్థలు శాటిలైట్ కమ్యూనికేషణ్ ధరలను ఎంతగా తగ్గించేందుకు ప్రయత్ర్నిస్తున్నా సంప్రదాయిక బ్రాడ్ బ్యాండ్ ధరలతో పోలిస్తే ఇవి 8 నుంచి 17 రెట్లు ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. అయితే, బ్రాడ్ బ్యాండ్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో శాటిలైట్ సేవలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తెచ్చి ఖర్చులు తగ్గించుకుంటూ లాభాల బాట పట్టాలని స్టార్‌లింక్ లాంటి సంస్థలు భావిస్తున్నాయి.



# క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపంలోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

**చార్జీలు**

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 ఉశాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

**వడ్డీ రేటు**

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

**లేటు చెల్లింపులు వద్దు**

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్ది గా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

**తొలి రోజు నుంచే వడ్డీ**

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

**పరిమితులు**

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువులోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



# ఖరీదైన బహుమతులు వచ్చాయా

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

**ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..**

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

**పన్ను పోటు లేని బహుమతులు**

పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్ట్‌లు

ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్ట్‌లు

ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు

ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్ట్‌లు

యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం

మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు

కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు

యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు

కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.


**రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?**

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

# పెన్నీలకి గుడ్‌బై..

## ఇకపై వీటి తయారీ ఉండదన్న ట్రంప్ ప్రభుత్వం





అగ్రరాజ్యం అమెరికా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అమెరికా ప్రభుత్వం (Trump Penny Decision) కొత్తగా పెన్నీలు (1 సెంట్ నాణేల) తయారుచేయదు. ఈ క్రమంలో యూఎస్ మింట్ (US Mint) కొత్త పెన్నీలు రావని అధికారికంగా ధృవీకరించింది. ఒక పెన్నీ తయారుచేయడానికి ప్రభుత్వానికి దాదాపు 4 సెంట్లు ($0.0369) ఖర్చవుతోంది. ఇది నాణేల విలువ కంటే అధికంగా ఉండటం విశేషం. 2024లో పెన్నీ తయారీ ఖర్చు 20.2% పెరిగిందని US మింట్ వార్షిక నివేదిక తెలిపింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

**ఎంత ఆదా అవుతుంది**

పెన్నీల తయారీ ఆపితే ప్రభుత్వానికి సంవత్సరానికి సగటున $56 మిలియన్ (రూ. 465 కోట్లు) ఆదా అవుతుందని అంచనా. ఇది కేవలం మెటీరియల్ ఖర్చు మాత్రమే. ప్రస్తుతం దేశంలో 114 బిలియన్ పెన్నీలు చలామణిలో ఉన్నప్పటికీ, అవి వాడకంలో లేవని ట్రెజరీ డిపార్ట్‌మెంట్ చెబుతోంది. పెద్ద మొత్తంలో డిజిటల్ లావాదేవీలు పెరిగిపోవడంతో చిన్న నాణేల అవసరం దాదాపు పూర్తిగా తగ్గిపోయింది.

**ట్రంప్ నిర్ణయం**

ఈ ఏడాది ఫిబ్రవరిలో, యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పెన్నీ ఉత్పత్తిని నిలిపివేయాలని తన ట్రెజరీ కార్యదర్శికి ఆదేశించారు. చాలా కాలంగా యునైటెడ్ స్టేట్స్ పెన్నీలను తయారు చేస్తోంది. ఇవి ఒక్కోటి తయారీకి 2 సెంట్ల కంటే ఎక్కువ ఖర్చు అవుతున్నాయి. ఇది ఎంతో వృథా అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ సైట్‌లో పేర్కొన్నారు.

**తర్వాత ఏం జరుగుతుంది**

2026 నాటికి మాత్రమే చివరి పెన్నీలు తయారవుతాయి. ప్రజలు వాటిని ఇంకా వాడతారు. కానీ వాటి వాడకం నెమ్మదిగా తగ్గుతుంది. నగదు లావాదేవీల్లో ధరలను నిక్కెల్ (5 సెంట్లు) వరకు రౌండింగ్ చేయవచ్చు. యూఎస్ మింట్ తమ చివరి ఆర్డర్‌ను పెన్నీ బ్లాంక్‌ల కోసం ఇచ్చిందని, ఆ బ్లాంక్‌లు అయిపోయిన తర్వాత పెన్నీ నాణెం ఉత్పత్తిని నిలిపివేయనున్నట్లు యూఎస్ ట్రెజరీ శాఖ అధికారి ధృవీకరించారు. 2026 ప్రారంభంలో కొత్త పెన్నీలను ప్రవేశపెట్టడం ఆపివేయాలని ట్రెజరీ శాఖ నిర్ణయించింది. ఆ తర్వాత, ఈ నాణెం పూర్తిగా ప్రజల వినియోగం నుంచి తొలగిపోనుంది.

**ఇతర దేశాల్లో ఏమైంది**

అయితే కెనడా 2012లో పెన్నీలను ఆపేసింది. ధరలు 5 సెంట్లకు రౌండ్ చేయడం మొదలుపెట్టారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ వంటి దేశాలు కూడా ఇదే విధానం పాటించాయి. అయితే ఇదే ట్రెండ్ ఇండియాలో కూడా కొనసాగుతుందా అంటే మాత్రం చాలా కష్టమని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఇండియాలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో చిల్లర నాణాల వినియోగం కొనసాగుతోంది. రూపాయి నుంచి 10 రూపాయల నాణాల వినియోగం ఎక్కువగా ఉంది.

# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

**ధర్మదర్శనానికి 4 గంటలు,**
**స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం**
**ఆదివారం ఆలయానికి**
**రూ.74.33 లక్షల ఆదాయం**
**ఆలయ అపరిశుభ్రతపై ఈవో సీరియస్**



**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సమ్మర్ హాలీడేస్ కు సండే తోడు కావడంతో.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా భక్తుల కోలాహలమే కనిపించింది. కొండపైన, కింద ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. రద్దీ కారణంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. నారసింహుడి ధర్మదర్శనానికి నాలుగు గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తుల కారణంగా కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, పార్కింగ్ ప్రదేశం, బస్ బే ఏరియా, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో సొంత వాహనాల్లో రావడంతో.. కొండపైన, కిందా పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. దీంతో రింగు రోడ్డు వెంట వాహనాలను పార్కింగ్ చేశారు. భక్తుల వాహనాలతో కొండపైన బస్ బే నిండిపోవడంతో.. కొండపైకి వాహనాలను నిలిపివేశారు. వాహనాల రద్దీ తగ్గాక తిరిగి వాహనాలను కొండపైకి అనుమతించారు. ఇక ధర్మదర్శనానికి గంటల తరబడి సమయం పట్టడంతో.. స్వామివారి దర్శనం తొందరగా కావడానికి భక్తులు వీఐపీ, బ్రేక్ దర్శనాలను ఆశ్రయించారు. రూ.150ల వీఐపీ టికెట్ల ద్వారా 11 వేల మంది భక్తులు, రూ.300ల బ్రేక్ దర్శన టికెట్ల ద్వారా 2,259 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆదివారం ఆలయ ఖజానాకు భారీగా ఆమ్దానీ**

నారసింహుడి దర్శనం కోసం తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు జరిపించిన పలు రకాల పూజల ద్వారా ఆదివారం ఆలయానికి భారీగా ఆమ్దానీ వచ్చింది. భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.74,33, 486 ఆదాయం సమకూరింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.24,07,390, వీఐపీ దర్శనాల ద్వారా రూ.16.50 లక్షలు, ప్రధాన బుకింగ్ తో రూ.9,87,600, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.7,70,500, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.6,77,700, యాదరిషి నిలయం ద్వారా రూ.4,33,810, సత్యనారాయ-ణస్వామి వ్రతాలతో రూ.2.92 లక్షలు, లీజెస్ ద్వారా రూ.3,22,661, కల్యాణకట్ట ద్వారా రూ.1.65 లక్షల ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా ఆదివారం 3,300 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**అపరిశుభ్రతపై ఈవో అసహనం**

యాదగిరిగుట్ట నారసింహుడు కొలువై ఉన్న కొండపైన ఆలయ ఈవో వెంకటరావు తెల్లవారుజామున 4 గంటల నుండి కలియతిరిగారు. ఆలయ పరిసరాలు, మాడవీధులు, ప్రధానాలయ ప్రాంగణ పరిసరాలను పరిశీలించారు. కొండపైన నెలకొన్న అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సీరియస్ అయ్యారు. ప్రతిరోజూ రాత్రి ఆలయం మూసివేయగానే క్లీనింగ్ పనులు చేపించాలని సంబంధిత కాంట్రాక్టర్, సూపర్ వైజర్లను మందలించారు. ప్రతిరోజూ తెల్లవారుజామున ఉదయం 4 గంటలలోపే క్లీనింగ్ పనులు పూర్తి చేయాలని, లేకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అభిషేక పూజలో పాల్గొన్న భక్తులతో మాట్లాడి వసతి ఏర్పాట్లు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.

## వీర జవాన్ మురళి నాయక్ కుటుంబానికి ఉపాధ్యాయుల భాసట

**హైదరాబాద్ :** ఆపరేషన్ సింధూర్ లో అశువులు బాసిన మురళి నాయక్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయులు స్పందించిన తీరు ప్రశంసనీయం. ప్రభుత్వ ఉపాధ్యాయుల చేత ఏర్పాటు అయిన "సూపర్ టీచర్స్ తెలంగాణ వాట్సాప్ గ్రూప్ వారు సామాజిక స్ఫూర్తి తో ఆపరేషన్ సింధూర్ లో దేశ రక్షణ కోసం అశు వులు బాసిన" అమర వీరజవాన్ మురళి నాయక్" కుటుంబానికి బాసటగా నిలవడానికి గ్రూప్ సభ్యుల నుండి,మరియు వారి ఇతర మిత్రుల నుండి సేకరించిన డబ్బును మురళి నాయక్ గారి కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి ఆదివారం సాయంత్రం అశోక్ నగర్ లో మేజర్ ఒబెరాయ్ కి 152119₹ రూపాయలకు గాను 2 చెక్కులు అందజేసారు. ఉపాధ్యాయులు 2,3 రోజుల్లో సత్యసాయి జిల్లాలో ఉన్న మురళి నాయక్ కుటుంబసభ్యులకు చెక్కులను అందజేస్తారు. ఈ కార్యక్రమం ద్వారా "దేశం కోసం ప్రాణాలు అర్పించే అర్పించిన వారికి ఈ దేశం ఎప్పుడూ అండగా ఉంటుంది "అని చెప్పడమే ముఖ్య ఉదేశ్యం.ఈ కార్యక్రమంలోసూపర్ టీచర్స్ తెలంగాణ గ్రూప్ అడ్మిన్ వంచా కొండల్ రెడ్డితో పాటు గ్రూప్ సభ్యులు మాజీ ఎంఈఓ బచ్చు.లక్ష్మీనారాయణ, ఏకు విజయ్ కుమార్ రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కంచరకుంటల వీరారెడ్డి, బసిరెడ్డి అమృతం, బుస్సా రమేష్, విష్ణు బాశెట్టి,మూల తిరుపతి రెడ్డి గార్లు పాల్గొన్నారు.




# ఆ వివాహ విందుకు.. మున్సిపల్ కార్మికులే అతిథులు

**హుజురాబాద్ లో సామిల్ యజమాని ప్రభాకర్ ఔదార్యం**
**కుమారుని వివాహ రిసెప్షన్ కు మునిసిపల్ సిబ్బందికి ఆహ్వానం**
**కార్మికులకు విందు భోజనం, కానుకలుగా వస్త్రాల పంపిణీ**



హుజురాబాద్, మే 25 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణంలో ఆదివారం జరిగిన ఓ వివాహ రిసెప్షన్ కు మున్సిపల్ కార్మికులే అతిథులయ్యారు. ప్రతాపవాడకు చెందిన నవజీవన్ సామిల్ యజమాని రావుల ప్రభాకర్ శ్రీమతి దంపతులు తమ కుమారుని వివాహ రిసెప్షన్ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య, ఇతర సిబ్బంది సుమారు 150 మందికి విందు భోజనం ఏర్పాటు చేయడంతో పాటు కొత్త బట్టలను కానుకలుగా అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రభాకర్ శ్రీమతి దంపతుల కుమారుడు రావుల నాగేంద్ర-తారల వివాహ రిసెప్షన్ ఆదివారం స్థానిక వెంకటసాయి గార్డెన్ లో జరిగింది. ఈ రిసెప్షన్కు సుమారు 150 మునిసిపల్ కార్మికులను కుటుంబాలతో ఆహ్వానించి విందు భోజనం ఏర్పాటు చేశారు. మహిళలకు చీరలు, పురుషులకు వస్త్రాలు బహుమతిగా అందజేశారు. వివాహానికి హాజరైన బంధుమిత్రులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకుల చేతుల మీదుగా మున్సిపల్ సిబ్బందికి బట్టలను అందజేశారు. మున్సిపల్ సిబ్బందిని వివాహ రిసెప్షన్ కు ఆహ్వానించి వస్త్రాలను అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్న ప్రభాకర్ శ్రీమతి దంపతులను అందరూ అభినందిస్తున్నారు.

## రసమయి అసత్య ఆరోపణలు మానుకో



తిమ్మాపూర్, జనతా న్యూస్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవినీతి జరగలేదని, అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కి కాంగ్రెస్ నాయకులు పలికారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎల్ గౌడ్, మండల అధ్యక్షులు బండారి రమేష్, జిల్లా నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి వద్ద ఆధారాలుంటే బయటపెట్టాలని.. లేదంటే నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. గత పదేళ్ల పాలనలో డబుల్ బెడ్ రూం ఇల్లు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు.హాకాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు మామిడి అనిల్, మీసాల అంజన్న, దావు సంపత్ రెడ్డి, గోపు మల్లారెడ్డి, కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగా రావు, మాచర్ల అంజయ్య గౌడ్, భూదారపు శ్రీనివాస్, పోలు రమేష్, రాములు యాదవ్, ఎలుక రాజు, రెడ్డిగాని రాజు తదితరులు ఉన్నారు.

## నూతన తహసిల్దార్‌కు సన్మానం



జనత న్యూస్ బెజ్జంకి: బెజ్జంకి మండల నూతన తహసిల్దార్ గ బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ ను మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శాలువాతో సన్మానించి, మండలంలోని భూ సమస్యలు వివరించినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కర వేణి పోచయ్య, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాసూరి మల్లికార్జున్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐలేని శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి జేఏసీ నాయకులు చెన్నా డి సుధాకర్ రెడ్డి, అన్నాడి రవీందర్ రెడ్డి, మరియు మహంకాల ప్రవీణ్ కుమార్, అక్కర వేణి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టడీ టూర్ కు మార్కెట్ కమిటీ పాలకవర్గం



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ నేతృత్వంలో శుక్రవారం జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల మార్కెట్ యార్డ్ లను పరిశీలించినట్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ మాట్లాడుతూ జగిత్యాల, మెట్ పల్లి, మార్కెట్ యార్డులతోపాటు నిజామాబాద్ మార్కెట్ యార్డ్ ను పరిశీలించి, మార్కెట్ విధివిధానాలను ఈ స్టడీ టూర్ ద్వారా తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు బోనాల మల్లేశం, పుల్లపోచయ్య, పులి సంతోష్ గౌడ్, చంద్రారెడ్డి, నరసయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు...?

**ఎల్ ఎం డి రిజర్వాయర్‌లో గుర్తింపు**
**విచారణ జరపాలంటున్న రామకృష్ణ కాలనీవాసులు**

**తిమ్మాపూర్, జనతా న్యూస్ :** లోయర్ మానేరు జలాశయం పరిధిలో తవ్వకాలు అనుమానాలకు తావిస్తోంది. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో ఎస్సారెస్పీ స్థలంలో తవ్వకాలను స్థానికులు గుర్తించారు. రిజర్వాయర్ లోపల తాపాలా గుట్టకు సమీపంలో గత కొంత కాలంగా గుప్త నిధుల కోసం జెసిబి తో తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం జెసిబి తో తవ్వకాలు జరుపుతుండగా మత్స్య కారుడు గమనించాడు. అతడిని గమనించిన కొందరు చెట్ల పొదల్లోకి వెళ్లగా ఆయన స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు అక్కడికి చేరుకునే లోగా కారులో వెళ్లిపోయారు. జెసిబి తో తవ్వకాలు చేపట్టడాన్ని స్థానికులు గమనించారు. అక్కడున్న వారిని స్థానికులు ప్రశ్నించగా తాము గుట్ట సమీపంలో మట్టి పోయడానికి తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిపారని అన్నారు. మట్టి కోసం తవ్వితే అంతా సమానంగా తీయకుండా లోతుగా ఎందుకు తవ్వారని రామకృష్ణ కాలనీ గ్రామస్తులు ప్రశ్నించారు. సమాధానం చెప్పకుండానే జెసిబి తో పాటు అక్కడున్న వారు వెళ్ళిపోయారు. కాగా తవ్వకాల వీడియోలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. కాగా దీనిపై పోలీసు అధికారులు విచారణ చేపట్టాలని రామకృష్ణ కాలనీ గ్రామస్తులు కోరుతున్నారు.

## ముంబైలో అవార్డు అందుకున్న.. హుజురాబాద్ యువకుడు ఆడెపు ధీరజ్

**ధీరజ్ కు జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు**




హుజురాబాద్, మే 25 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ఆడెపు సూర్యం సంధ్యారాణి దంపతుల కుమారుడు ఆడెపు ధీరజ్ జాతీయస్థాయిలో "గ్రేట్ పీపుల్ మేనేజర్ అవార్డు" ముంబైలో అందుకున్నారు. కార్పొరేట్ రంగంలో అత్యంత ప్రతిభ కనబరిచి నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం ప్రదర్శించిన వారికి ఈ అవార్డు అందజేస్తారు. దేశవ్యాప్తంగా 100 మందిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్రేట్ మేనేజర్స్ సంస్థ అవార్డు కోసం ఎంపిక చేసింది. ఇందులో హుజురాబాద్ కు చెందిన ఆడెపు ధీరజ్ ఉండడం గమనార్హం. రెండు రోజుల క్రితం ముంబాయిలోని టాటా నేషనల్ సెంటర్ ఫర్ ద పర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎన్సీపీఏ) లో నిర్వహించిన జిఎంఐ సమ్మిట్ 2025 లో ధీరజ్ కు ఈ అవార్డు తోపాటు ప్రశంసా పత్రాన్ని సంస్థ నిర్వాహకులు అందజేశారు. ఆడెపు ధీరజ్ ఓరియంట్ సిమెంట్ లో సేల్స్ మేనేజర్ గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో అవార్డు అందుకున్న ఆడెపు ధీరజ్ ను రాజ్యసభ మాజీ సభ్యులు కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వి సతీష్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కె డి సి సి బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఎర్రం నారాయణరెడ్డి, ఎస్సారెస్పీ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ చొల్లేటి కిషన్ రెడ్డి, అన్నపూర్ణ ఇండస్ట్రీస్ అధినేత కల్లెపు మోహన్ రావు, మాజీ జెడ్పిటిసి తోట రాజేంద్రప్రసాద్, పారిశ్రామికవేత్త వర్దినేని రవీందర్రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయకుమార్, హుజురాబాద్ క్లబ్ చైర్మన్ తుమ్మల శ్రీరామ్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు అభినందించారు. అలాగే కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వ్యాపారులు, ప్రముఖులు ధీరజ్ అభినందిస్తున్నారు.

# బరువు నియంత్రణకు

ఉదయం నిద్ర లేచాక కాలకృత్యాలు తీర్చుకున్న వెంటనే బరువు తూచుకోవటం మంచిది. అప్పుడైతే కడుపు ఖాళీగా ఉంటుంది. ఏ మధ్యాహ్నామో, సాయంత్రమో బరువు చూసుకుంటే అప్పటివరకు తిన్న పదార్థాల బరువూ తోడవుతుంది. దాంతో బరువు తగ్గుతున్నామా, లేదా? అనేది కచ్చితంగా తెలియదు. ఒకవేళ బరువు తగ్గనట్టు అనిపిస్తే.. సమస్య ఎక్కడుందో గుర్తించి, పకడ్బందీగా తిరిగి ప్రయత్నించే వీలుంటుంది.



**- నీరు తాగాలి**

టిఫిన్ తినటానికి ముందే.. ఒకట్రెండు గ్లాసుల నీళ్లు తాగితే బరువు తగ్గటానికి అవకాశం ఉంటుంది. నీటిలో క్యాలరీలు ఉండవు కానీ కడుపు నిండుతుంది. ఆకలి తగ్గుతుంది. దీనివల్ల మరీ ఎక్కువగా టిఫిన్ తినకుండా చూసుకోవచ్చు. నీటితో జీవ క్రియల వేగమూ పుంజుకుంటుంది. క్యాలరీలు ఖర్చు కావడానికి సాయం చేస్తుంది. నీళ్లు ఎక్కువగా తాగినవారు... తీపి పానీయాలు, కొవ్వు పదార్థాలు, చక్కెర, ఉప్పు తక్కువగా తీసుకున్నట్లు అధ్యయనాల్లో తేలింది.

**ఖాళీ కడుపుతో వ్యాయామం**

టిఫిన్ తినటానికి ముందే వ్యాయామం చేయటం ఉత్తమం. ఖాళీ కడుపుతో వ్యాయామం చేస్తే కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. శరీరం శక్తి కోసం కొవ్వును వినియోగించుకుంటుంది. కాబట్టి ఆ సమయంలో అదనపు కొవ్వు ఇట్టే కరిగిపోతుంది.

**నడకను మించింది లేదు...**

జిమ్‌కి వెళ్లకుండా బరువు తగ్గాలనుకుంటే... నడకను మించిన మంత్రం లేదు. రోజూ మార్నింగ్ వాక్ చేయడం అలవాటు చేసుకోవాలి. కొంతమంది చాలా మెల్లిగా నడు-స్తుంటారు. ఇలా చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. కాబట్టి నడిచిన అరగంటైనా కొంచెం వేగంగా నడవాలని సూచిస్తున్నారు నిపుణులు. అప్పుడే శరీరానికి చెమట పట్టి తొందరగా బరువు తగ్గుతారు. అలాగే నడిచేటప్పుడు వీపును నిటారుగా ఉంచి నడవాలి. ఇలా చేస్తేనే ఎక్కువ క్యాలరీలు బర్న్ అవుతాయి.

**ఒత్తిడి దరి చేరకుండా...**

ఒత్తిడిలో ఉన్నప్పుడు శరీరం కార్టిసాల్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది బరువు పెరగడానికి దారి తీస్తుంది. కాబట్టి ఒత్తిడి దరిచేరకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా మైండ్‌ఫుల్ నెస్‌ని (శ్వాస మీద దృష్టి కేంద్రీకరించి, అవయవాలు, ఆలోచనల మీద కంట్రోల్ సాధించడమే 'మైండ్‌ఫుల్‌నెస్') సాధన చేయడం ఉత్తమం.

**ఆహార జాబితా**

రోజంతా ఏమేం తింటామో ఉదయాన్నే జాబితా సిద్ధం చేసుకోవాలి. దీనివల్ల తక్కువ క్యాలరీలు లభించే ఆహారాన్ని ముందే నిర్ణయించుకోవచ్చు. అధిక క్యాలరీలు ఉండే జంక్ ఫుడ్ జోలికి పోకుండా ముందుగానే జాగ్రత్త పడొచ్చు



**ప్రొటీన్‌పై శ్రద్ధ...**

అల్పాహారంలో ప్రొటీన్ కాస్త ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇది ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. నిజానికి పిండి పదార్థాన్ని, కొవ్వును జీర్ణం చేసుకోవటం కన్నా.. ప్రొటీన్స్‌ను జీర్ణం చేసుకోవటానికి శరీరం ఎక్కువ క్యాలరీలను వినియోగించుకుంటుంది. కాబట్టి అల్పాహారంలో మినుములు, పెసర, వేరుశనగ వంటి పప్పులతో చేసే పదార్థాలు, గుడ్డు, పెరుగు వంటివి చేర్చుకోవటం మంచిది.

**నెమ్మదిగా తినాలి**

అల్పాహారాన్ని నెమ్మదిగా ఆస్వాదిస్తూ తినాలి. ఇలా తినడం వల్ల ఎంత తింటున్నాం? ఏం తింటున్నాం? అనేది అర్థమవుతుంది. తద్వారా అవసరమైనంత ఆహారాన్ని మాత్రమే తీసుకోగలుగుతాం. ఇది బరువు తగ్గడానికి తోడ్పడుతుంది.

**ఎండలో గడపాలి**

ఉదయాన్నే శరీరానికి కాస్త ఎండ తగిలేలా చూసుకుంటే ఎక్కువగా కొవ్వు కరిగే అవకాశ ముంది. కాబట్టి పొద్దున్న 10- 15 నిమిషాల పాటు ఎండలో వ్యాయామం, నిలబడటం లాంటివి చేయాలి. ఉదయం ఎండలో గడిపే వారి బరువు నియంత్రణలో ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి



## ఆస్తమా రోగులు ఈ విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

### నిర్లక్ష్యం చేస్తే ఇన్హేలర్ కూడా పనిచేయదు..

ఆస్తమా అనేది శ్వాసకోశ వ్యాధి. ఒకరికి ఆస్తమా ఉన్నప్పుడు, వాయునాళం కుంచించుకుపోవడం ప్రారంభమవుతుంది. దీనివల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఆస్తమా రోగులు తమ ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేదంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. సరికాని ఆహారం తీసుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ఆస్తమాతో బాధపడేవారు ఏలాంటి ఆహారా పదార్థాలు తీసుకోవడం మంచిది కాదో ఇప్పుడు తెలుసుకుందాం..

**పాల ఉత్పత్తులు**

ఆస్తమాతో బాధపడేవారు పాలు, జున్ను, ఐస్ క్రీం వంటి పాల ఉత్పత్తులను తీసుకుంటే ఆరోగ్యానికి హాని కలుగుతుంది. పాల ఉత్పత్తులలోని ప్రోటీన్, కొవ్వు.. శరీరంలో శ్లేష్మం పెరగడానికి కారణమవుతాయి. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. పాల ఉత్పత్తులను అధికంగా తీసుకోవడం వల్ల ఆస్తమా ప్రమాదం పెరుగుతుంది.

**ప్యాక్ చేసిన ఆహారాలు**

చిప్స్, ప్యాక్ చేసిన నూడుల్స్, ఫ్రోజెన్ ఫుడ్స్ వంటి ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవడం వల్ల కూడా ఆస్తమా సమస్య పెరుగుతుంది. ప్యాక్ చేసిన, ప్రాసెస్ చేసిన ఆహారాలు తినడం వల్ల అలెర్జీలు, వాపు సమస్య పెరుగుతుంది. కాబట్టి, వీటిని తీసుకోవడం మంచిది కాదు.

**నూనె ఆహారాలు**

సమోసా, పకోడి, ఫ్రైడ్ చికెన్ వంటి నూనె పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో వాపు పెరుగుతుంది. ఈ ఆహారాలు తీసుకోవడం వల్ల ఆస్తమా సమస్య పెరుగుతుంది. నూనె పదార్థాలు తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరుగుతుంది.

**శీతల పానీయాలు**

స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, శీతల పానీయాలు వంటి తీపి పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆస్తమా ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి, ఇలాంటి వాటిని తినడం మంచిది కాదు.

# లెట్యూస్ ఆకు తెగ తింటున్నారు..

ఎండలకు బాగా అలసిపోతున్నారా? చల్లని మంచి నీళ్లు తాగుతూనే ఉండాలని అనిపిస్తోందా? సలాడ్ రూపంలో కొన్ని లెట్యూస్ ఆకుల్ని తీసుకోండి. శరీరానికి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఈ ఆకుల్లో 95 శాతం నీళ్లే మరి. అందుకే సలాడ్లు, బర్గర్లలో లెట్యూస్ బాగా పాపులర్.

ఉడికించిన లెట్యూస్‌పై కాస్త వెనిగర్, నూనె వేసుకుని అప్పట్లోనే రోమన్లు తినేవారట. సలాడ్‌ల రూపంలో లెట్యూస్‌ను ఆరగించడం క్రీశ 81లో మొదలైంది. ప్రస్తుతం లెట్యూస్‌ను ఉత్పత్తి చేస్తున్న దేశాల లిస్టులో మొదటి స్థానం చైనాది. రెండో స్థానంలో అమెరికా, మూడో స్థానంలో మనదేశం ఉన్నాయి. విత్తనాలు, కాండం, ఆకుల కోసం లెట్యూస్‌ను పండిస్తున్నారు. ఈ ఆకుకూర సుగుణాల గురించి ఇప్పుడిప్పుడే మన దగ్గర అవగాహన పెరుగుతోంది.



**అయిదు రకాలు**

చూడడానికి ఒకేలా కనిపించినా లెట్యూస్‌లో ఎన్నో రకాలు. రంగు, రుచి, పోషక విలువల్లో ఉన్న తేడాల కారణంగా ప్రధానంగా వీటిని అయిదు రకాలుగా విభజించవచ్చు.

- రొమీన్: ప్రపంచవ్యాప్తంగా అందరూ ఇష్టపడే రకం. ఆకులు కాస్త వగరుగా ఉంటాయి. విటమిన్ ఎ, సి, కె, ఫోలేట్, పొటాషియం పాళ్లు ఈ రకంలో ఎక్కువ. సలాడ్స్, రాప్స్, గ్రిల్స్‌లో ఎక్కువగా వినియోగించే రకం ఇదే.
- ఐస్‌బర్గ్: ఎక్కువగా కరకరలాడుతూ ఉంటుంది. రుచి మధ్యస్తం. శాండ్విచ్, బర్గర్లలో ఎక్కువగా ఉపయోగిస్తారు. పోషక విలువలు తక్కువ. విటమిన్ కె, ఫోలేట్ తక్కువ శాతంలో ఉంటాయి. అయితే నీటి శాతం ఎక్కువ. కాబట్టి ఎండాకాలంలో హైడ్రేటింగ్ ఏజెంట్‌గా భావించవచ్చు.
- బటర్ హెడ్: ఆకులు మృదువుగా, లేతగా ఉంటాయి. కొద్దిగా తియ్యని ఫ్లేవర్ మిళితమైన ఫీలింగ్ కలుగుతుంది. విటమిన్ ఎ, క్యాల్షియం, ఐరన్ పాళ్లు ఇందులో ఎక్కువ.
- లీఫ్: ఆకుపచ్చ, ఎరుపు రంగులో ఉంటుంది. ఆకులు లేతగా ఉంటాయి. రుచి సాధారణం. విటమిన్ ఎ, కెతో పాటు యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికం.
- బతావియా: నోట్లో వేసుకోగానే కరిగిపోతుంది. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్ల పాళ్లు ఎక్కువ.
- వివిధ ప్రాంతాలలో వివిధ రకాలైన లెట్యూస్‌ను సాగు చేస్తున్నారు. ఈజిప్టు, చైనాలో స్టెమ్ లెట్యూస్ ఉత్పత్తి ఎక్కువ. మధ్యధరా ప్రాంతంలో రొమీన్ ప్రసిద్ధి. ఉత్తర యూరప్‌లో బటర్‌హెడ్ బాగా పండుతోంది.
- కొన్ని వేల ఏళ్ల నుంచి లెట్యూస్‌ను పండిస్తున్నారు కానీ ఈమధ్యే బాగా పాపులర్ అయింది. కారణం ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ లెట్యూస్‌ను విరివిగా ఉపయోగించేలా చేస్తోంది. ఈ ఆకుకూరలోని పోషకాలు, ప్రయోజనాల గురించి చెప్పాలంటే...
- క్యాన్సర్ నివారణ: లెట్యూస్‌లో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. విటమిన్ సి, కెరోటినాయిడ్స్, ఫోలేట్స్, క్లోరోఫిల్ తదితరాలు ఉండడం వల్ల క్యాన్సర్‌లాంటి వ్యాధులు రాకుండా లెట్యూస్ నివారిస్తుంది.
- మలబద్ధకం హుష్‌కాకి: ఈ ఆకుకూరలో ఉన్నదంతా నీళ్లు, పీచు పదార్థాలే. అందుకే సాఫీగా అరగేందుకు సహాయపడుతుంది.
- ప్రశాంతత: ఆందోళన, ఒత్తిడితో సతమతమవుతున్న వాళ్లకు చక్కని ఉపశమనంగా లెట్యూస్‌ను పేర్కొనవచ్చు. ఈ ఆకులకు చక్కని నిద్రను కలిగించే గుణం ఉంది. నిద్రలేమికి పరిష్కారంగా కూడా కొన్ని ప్రాచీన వైద్యాలు ఉపయోగించాయి.
- రక్తహీనతకు చెక్: ఇందులో ఫోలిక్ యాసిడ్, ఐరన్ ఎక్కువగా ఉంటయి కాబట్టి రక్తహీనతకి చక్కని మందు లెట్యూస్. అయితే ఇందులోని ఐరన్‌ను శరీరం చక్కగా సంగ్రహించాలంటే మాత్రం విటమిన్ సి అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవడం మంచిది.
- ఎముకల ఆరోగ్యం: క్యాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం లాంటి ఖనిజాలు లెట్యూస్‌లో ఎక్కువ. కాబట్టి ఈ ఆకుకూరలు ఆరగించడం వల్ల ఎముకలు పుష్టిగా ఉంటాయి.
- వయసు తెలియనీయదు: ఇందులోని విటమిన్ ఎ, ఈ లు సూర్యుడి అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి సంరక్షిస్తాయి. అలాగే లెట్యూస్‌లోని విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. తద్వారా చర్మంపై ముడతలు పడకుండా కాపాడుతుంది.
- చక్కని కంటిచూపునకు: విటమిన్ ఎ ఎక్కువగా ఉండడం వల్ల కంటిచూపునకు రక్షగా నిలుస్తుంది. వయసు పరంగా వచ్చే ఛత్వారాన్నీ నివారిస్తుంది.
- చక్కెరవ్యాధిపై దాడి: ఈ ఆకులో పీచుపదార్థాలు ఎక్కువ. కాబట్టి రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా చేస్తుంది. చక్కెర వ్యాధిగ్రస్తులకు, ప్రీడయాబెటిక్ వారికీ లెట్యూస్ పెద్ద సహాయకారి.
- బరువు తగ్గొచ్చు: బరువు తగ్గించే ప్రయత్నాల్లో ఉన్న వారికీ లెట్యూస్ చక్కని పరిష్కారం. వీటిని కాస్త తినగానే కడుపు నిండిపోతుంది. పైగా ఇందులో నీళ్లు ఎక్కువ, క్యాలరీలు తక్కువ. అందుకే ఫిట్‌నెస్ ప్రియులు వీటిని బాగా ఇష్టపడుతున్నారు.
- అయితే ఎన్నో సుగుణాలు ఉన్నాయని లెట్యూస్‌ను అతిగా తీసుకోవడం మంచిది కాదంటున్నారు ఆహార నిపుణులు. ఈ ఫుడ్ బ్యాలెన్స్‌డ్ డైట్‌లో భాగంగా మాత్రమే అన్నది గుర్తుంచుకోవాలి. అప్పుడే సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆశించిన ఫలితాలు అందుతాయి. ఆరోగ్యం ఆకుపచ్చని లెట్యూస్‌లా కళకళలాడుతుంది.
- స్మూతీలు, సూప్‌లు

లెట్యూస్‌ను వంటకాల్లో ఎలా ఉపయోగించవచ్చో చూద్దాం.

సలాడ్స్ : పళ్లు, కూరగాయలు, నట్స్‌తో లెట్యూస్‌ను కలిపి అద్భుతమైన సలాడ్ తయారుచేయవచ్చు.

రాప్స్: ఉరుకుల పరుగుల నేటి జీవనంలో ఆహార రాప్స్ పెద్ద రిలీఫ్. శాండ్విచ్, టాకోస్, బర్గర్లలో పెద్ద పెద్ద ఆకుల లెట్యూస్‌ను వాడతారు.

స్మూతీలు : తాజా పళ్లు, యోగర్ట్, కాస్త తేనెతో పాటు లెట్యూస్ ఆకుల్ని చేర్చి బ్లెండ్ చేసిన స్మూతీలు ఎంతో ఆరోగ్యకరం.

సూప్‌లు: ఇంట్లో తయారుచేసుకునే వెజిటబుల్ సూప్‌లలో ఇకపై లెట్యూస్ ఆకుల్ని కూడా చేర్చితే ఆరోగ్యానికి ఆరోగ్యం, రుచికి రుచి.

- ఔషధపరంగా...

సంప్రదాయ, హెర్బల్ ఔషధాల తయారీలో లెట్యూస్‌ను అనాదిగా అనేక దేశాలలో వినియోగిస్తున్నారు. ప్రాచీన ఈజిప్టు, రోమ్‌లో లెట్యూస్ ఆకుల్ని తినడం వల్ల లైంగిక సామర్థ్యం పెరుగుతుందని భావించేవారు. దక్షిణ అమెరికాలో స్మాల్ పాక్స్ నివారణలో లెట్యూస్ ఉపయోగించేవారు. వాస్తవానికి ప్రాచీన ఈజిప్టువాసులే తొలిగా లెట్యూస్‌ను పండించడం ప్రారంభించారు. అక్కడి నుంచే గ్రీస్, రోమ్‌లకు వెళ్లి, యూరప్ అంతా విస్తరించింది. యూరోపియన్ వలసదారుల వల్ల మిగతా ప్రపంచానికి పరిచయమైంది.



**రెండూ ఒకటి కాదు**

క్యాబేజీ, లెట్యూస్... రెండూ ఒకేలా కనిపిస్తున్నా, వీటి మధ్య ఎంతో తేడా ఉంది. రెండూ వేర్వేరు కుటుంబాలకు చెందిన ఆకు కూరలు. క్యాబేజీ గుండ్రంగా, లెట్యూస్ దీర్ఘచతురస్రాకారంగా ఉంటాయి. క్యాబేజీకి చిన్న కాండం, ఆకులు దళసరిగా, ఎంతో దగ్గరిదగ్గరిగా చుట్టుకుని ఉంటాయి. లెట్యూస్ ఆకులు మృదువుగా, కాడ నుంచి సులభంగా తొలగించవచ్చు. ఇంకా లెట్యూస్‌లో క్లోరోఫిల్ శాతం ఎక్కువ. అందుకే గాఢ ఆకుపచ్చ రంగులో ఉంటుంది.

# కేకేఆర్‌పై ఘన విజయం

## ఐపీఎల్ చరిత్రలో సన్‌రైజర్స్ మూడో అత్యధిక స్కోరు

## క్లాసెన్ మెరుపు శతకం.. హైదరాబాద్ 278/3





ఢిల్లీ: భారీ అంచనాలతో ఐపీఎల్-18 బరిలోకి దిగి ఆశించిన స్థాయిలో రాణించలేక ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్).. రికార్డు స్కోర్లు చేయడంలో మాత్రం తమకు తామే సాటి అని మరోసారి నిరూపించుకుంది. ఆదివారం ఢిల్లీలో డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. 20 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 278 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ లీగ్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు.

హెన్రిచ్ క్లాసెన్ (39 బంతుల్లో 105 నాటౌట్‌బీ 7 ఫోర్లు, 9 సిక్సర్లు) మెరుపు శతకానికి తోడు ట్రావిస్ హెడ్ (40 బంతుల్లో 76, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టారు. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా.. 18.4 ఓవర్లలో 168 రన్స్‌కు ఆలౌటై 110 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మనీష్ ఫాండె (37), హర్షిత్ రానా (34లి), సునీల్ నరైన్ (31) కేకేఆర్ ఓటమి అంతరాన్ని తగ్గించారు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో ఉనద్కత్ (3/24), హర్ష్ దూబె (3/34) రాణించారు.

బాదుడు మంత్రం

నోకియా రెండో ఓవర్లో సిక్సర్‌తో హెడ్.. దంచుడుకు ముహూర్తం పెట్టగా అదే ఓవర్లో అభిషేక్ శర్మ (16 బంతుల్లో 32బీ 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండు బౌండరీలు కొట్టాడు. ఆ తర్వాత హెడ్.. వైభవ్, హర్షిత్ లక్ష్యంగా చేసుకుని వీరబాదుడు బాదడంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు 79/0గా నిలిచింది. 'ట్రావిషేక్' జోడీ 7 ఓవర్లకే 92 పరుగులతో అదిరిపోయే ఆరంభాన్నిచ్చింది. నరైన్ ఏడో ఓవర్లో అభిషేక్ ఔట్ అయినా మూడో స్థానం లో క్లాసెన్ రాకతో కోల్‌కతా బౌలర్ల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యి లో పడ్డట్టైంది. వరుణ్ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాదడంతో హెడ్ అర్ధ శతకం పూర్తయింది. మరో ఎండ్‌లో క్లాసెన్ వచ్చీ రాగానే కేకేఆర్ బౌలర్లపై పిడుగులా విరుచుకుపడటంతో హైదరాబాద్ 10 ఓవర్లకే 139/1 స్కోరు చేసింది.

హర్షిత్ 11వ ఓవర్లో క్లాసెన్.. 4, 6, 6తో 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఎట్టకేలకు నరైన్ 13వ ఓవర్లో హెడ్‌ను ఔట్ చేయడంతో హైదరాబాద్ రెండో వికెట్ కోల్పోయింది. క్లాసెన్‌తో కలిసి హెడ్ రెండో వికెట్‌కు 35 బంతుల్లోనే 83 రన్స్ జోడించాడు. హెడ్ నిష్క్రమించినా క్లాసెన్ దూకుడు తగ్గలేదు. ఇషాన్ కిషన్ (29) అండగా అతడు మరింత రెచ్చిపోయి ఆడటంతో 15 ఓవర్లకే సన్‌రైజర్స్ 200 దాటింది. రసెల్ ఓవర్లో 4, 6, 4తో 90లలోకి వచ్చిన క్లాసెన్.. వైభవ్ 19వ ఓవర్లో వేసిన ఆఖరి బంతిని మిడ్ వికెట్ దిశగా తరలించి తన కెరీర్‌లో రెండో ఐపీఎల్ శతకాన్ని నమోదుచేశాడు. ఇషాన్‌తో మూడో వికెట్‌కు క్లాసెన్.. 36 బంతుల్లో 83 రన్స్ జతచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 278/3 (క్లాసెన్ 105లి, హెడ్ 76, నరైన్ 2/42, వైభవ్ 1/39) కోల్‌కతా: 18.4 ఓవర్లలో 168 ఆలౌట్ (మనీష్ 37, హర్షిత్ 34లి, ఉనద్కత్ 3/24, హర్ష్ 3/34).

# ఆర్‌సీబీకి కొత్త జోష్

## జట్టుతో కలిసిన హాజిల్‌వుడ్



లక్నో: ప్లేఆఫ్స్‌కు ముందు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అభిమానులకు అదిరిపోయే శుభవార్త. ఆ జట్టు స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ లక్నోలో జట్టుతో కలిశాడు.

భారత్-పాక్ దేశాల ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ వారం రోజులు వాయిదా పడటంతో ఆస్ట్రేలియాకు వెళ్లిపోయిన ఈ ఆసీస్ పేసర్ తిరిగి రావడం కష్టమేనని అనుకున్నా.. ఎట్టకేలకు అతడు జట్టుతో కలవడంతో బెంగళూరు బౌలింగ్ విభాగం పటిష్టమైంది.

# రన్నరప్‌తో సరి

## ఫైనల్‌లో తడబడ్డ శ్రీకాంత్

## మలేషియా మాస్టర్స్



కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్‌లో సంచలన విజయాలతో ఫైనల్ చేరిన భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం రన్నరప్‌తో ముగిసింది. బీడబ్ల్యూఎఫ్ నిర్వహించే టోర్నీలలో ఆరేండ్ల తర్వాత ఫైనల్‌కు అర్హత సాధించిన అతడు.. కీలక పోరులో తడబాటుకు గురయ్యాడు. క్వాలిఫయర్ దశ నుంచి మొదలుకుని సెమీస్ దాకా తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన షట్లర్లకు షాకిచ్చిన ఈ ప్రపంచ మాజీ నెంబర్ వన్.. ఫైనల్‌లో మాత్రం ఆ స్థాయి ప్రదర్శన చేయలేక చతికిలపడ్డాడు.

ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో శ్రీకాంత్.. 11-21, 9-21తో చైనా షట్లర్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ లి షెంగ్ ఫెంగ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. వరుస గేమ్‌లలో చిత్తైన శ్రీకాంత్.. ఆరంభం నుంచే తడబడి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. 36 నిమిషాల్లోనే ఆటను ముగించిన లి షెంగ్.. మ్యాచ్ ఆసాంతం శ్రీకాంత్ చేసిన అనవసర తప్పిదాలను అందిపుచ్చుకుని వాటిని అతడికి అనుకూలంగా మలుచుకున్నాడు.

తొలి గేమ్ ఆరంభంలోనే 14-8తో లి ఆధిక్యంలోకి దూసుకెళ్లగా శ్రీకాంత్ కాస్త పుంజుకోవడంతో దానిని 10-16కు తగ్గించాడు. కానీ లి మాత్రం దూకుడును కొనసాగిస్తూ ఆ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్ ఏకపక్షంగానే సాగడంతో శ్రీకాంత్‌కు నిరాశ తప్పలేదు. ఫైనల్‌లో ఓడినా తన ఆట పట్ల సంతృప్తిగా ఉన్నానని, తుదిపోరులో తనకు ఆశించిన ఫలితం రాకపోయినా టోర్నీ ఆసాంతం మంచి ప్రదర్శన చేశానని మ్యాచ్ అనంతరం శ్రీకాంత్ తెలిపాడు.

# విజయంతో ముగించారు



## తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ విక్టరీ

## గుజరాత్ టైటాన్స్‌పై 83 పరుగులతో గెలుపు

## మెరిసిన బ్రెవిస్, నూర్

అహ్మదాబాద్: ఐపీఎల్-18 సీజన్ ఆసాంతం ఒడిదొడుకులతో సాగిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్రయాణం విజయంతో ముగిసింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో చెన్నై.. టేబుల్ టాపర్స్ గుజరాత్ టైటాన్స్‌కు షాకిస్తూ ఆ జట్టుపై 83 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. డబుల్ హెడర్‌లో భాగంగా ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది.

'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' డెవాల్డ్ బ్రెవిస్ (23 బంతుల్లో 57బీ 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (35 బంతుల్లో 52బీ 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఉర్విల్ పటేల్ (19 బంతుల్లో 37బీ 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుష్ మాత్రె (17 బంతుల్లో 34బీ 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించడంతో ఈ సీజన్‌లో సీఎస్‌కే తొలిసారి 200 పరుగుల మార్కును దాటింది. భారీ ఛేదనలో గుజరాత్.. 18.3 ఓవర్లలో 147 పరుగులకే కుప్పకూలింది. సాయి సుదర్శన్ (28 బంతుల్లో 41బీ 6 ఫోర్లు) టాప్ స్కోరర్. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ (3/13), నూర్ అహ్మద్ (3/21), రవీంద్ర జడేజా (2/17) టైటాన్స్‌ను దెబ్బకొట్టారు.

**సమిష్టి విజయం**

అర్షద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే ఆయుష్.. 6, 6, 4, 4, 6తో 28 పరుగులు పిండుకుని చెన్నైని టాప్ గేర్‌లోకి తెచ్చాడు. ఆ తర్వాత కాన్వే, ఉర్విల్.. స్కోరు వేగం తగ్గకుండా ధాటిగా ఆడటంతో 9 ఓవర్లకే చెన్నై 100 పరుగుల మార్కును అందుకుంది. ఈ ఇద్దరూ నిష్క్రమించినా ఆఖర్లో జడేజా (21)తో కలిసి బ్రెవిస్.. టైటాన్స్ బౌలర్లపై సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఛేదనలో మూడో ఓవర్లోనే సారథి గిల్ (13) వికెట్ కోల్పోయిన టైటాన్స్.. తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు.

బట్లర్ (5), రూథర్‌ఫర్డ్ (0), షారుక్ (13), తెవాటియా (14) విఫలమయ్యారు. ఆరంభంలో జడేజా, అన్షుల్ గుజరాత్‌ను దెబ్బతీస్తే నూర్ లోయరార్డర్ పనిపట్టాడు. కాగా ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లాడి నాలుగింట్లో మాత్రమే గెలిచిన చెన్నై.. 8 పాయింట్లతో పదో స్థానంలో నిలిచింది. ఒక ఐపీఎల్ సీజన్‌లో పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలవడం చెన్నైకి ఇదే తొలిసారి కావడం గమనార్హం.



## డ్రాగన్ కోసం నేషనల్ క్రష్.. మళ్ళీ ఈ ట్విస్ట్ ఏంటీ?

పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఎన్టీఆర్ %-% ప్రశాంత్ నీల్ కాంబో సినిమా డ్రాగన్ మీద ఓ వెరైటీ క్రేజ్ నెలకొంది. ఇది కేవలం యాక్షన్ ఎంటర్‌టైనర్ మాత్రమే కాకుండా, ఎన్టీఆర్ కెరీర్‌లో ఓ హై వోల్టేజ్ విజువల్ వండర్‌గా నిలవాలని ప్రశాంత్ నీల్ పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నాడు. 'కేజీఎఫ్', 'సలార్' లాంటి సినిమాల తర్వాత ఆయన ఏది చేసినా నేషనల్ వాయిస్ లాగానే ఉంటోంది. ఈ సినిమాకు సంబంధించి ప్రతిరోజూ ఏదో ఒక అప్డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంటుంది. ఈ మధ్య విడుదలైన లుక్ పిక్స్, స్టంట్స్ షూట్ అప్డేట్స్‌తో అభిమానుల ఉత్సాహం పెరిగింది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సంగీతానికి రవి బస్రూర్ పని చేస్తున్నారు. కథ విషయంలోనూ ఈసారి ప్రశాంత్ పూర్తి ఫోకస్ పెట్టాడని, ఎమోషన్, యాక్షన్ మిక్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేసే ప్రయత్నం చేస్తున్నాడని సమాచారం. అయితే ఇప్పుడు ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన రూమర్ వైరల్ అవుతోంది. చిత్రంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ఓ స్పెషల్ సాంగ్ చేయబోతుందట. ఇది కేవలం ఐటెమ్ సాంగ్ కాదు, కథలో కీలక మలుపు తిప్పే స్పెషల్ సీక్వెన్స్‌లో వస్తుందట. సినిమాలో ఎన్టీఆర్ కు జోడిగా రుక్మిణి వసంత్ నటిస్తోంది. ఇక మొదట రష్మిక కీలక పాత్రలో నటించనున్నట్లు టాక్ వచ్చింది. ఇక ఇప్పుడు స్పెషల్ సాంగ్ అనే టాక్ వైరల్ అవుతోంది. ఇప్పటికే ప్రశాంత్ నీల్ ఆమెను అప్రోచ్ అవ్వగా, రష్మిక కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాక్. ఇప్పటివరకు ఎన్టీఆర్ %-% రష్మిక ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన సందర్భం లేదు. ఈ కాంబినేషన్ స్క్రీన్ మీద కనిపిస్తే క్రేజ్ కలగడం ఖాయం.



## దీపికను ఆడిపోసుకోవడం సరైనదేనా?

దీపిక పదుకొనే అకస్మాత్తుగా ప్రభాస్- సందీప్ వంగా స్పిరిట్ నుంచి తప్పుకోవడం చాలా విమర్శలకు తావిచ్చింది. సోషల్ మీడియాలో ఈ భామ చాలా పెద్ద నేరం చేసిందని ప్రచారం సాగుతోంది. దేశంలో ఎదురేలేని పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ నే కాదని అంటుందా? భారతదేశంలో మోస్ట్ సక్సెస్ ఫుల్ పాన్ ఇండియన్ డైరెక్టర్ సందీప్ వంగాకే అడ్డు చెబుతుందా? .. ప్రస్తుతం ఫిలింకారిడార్ లో కొనసాగుతున్న చర్చ ఇది. రోజుకు 6 గంటల పని, సెట్లో కొన్ని సౌకర్యాలు, తన స్టార్ డమ్ రేంజుకి తగ్గట్టు పారితోషికాన్ని దీపిక కోరిందని, తన నవజాత శిశువుతో సమయం గడపాలి గనుక, దర్శకుడు సందీప్ వంగా కండీషన్లకు కుదరదని దీపిక సూటిగా చెప్పేసి ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. అయితే ఇంత పెద్ద ప్రాజెక్టును వదులుకున్నందుకు చాలామంది దీపికను తప్పు పడుతున్నారు. సందీప్ వంగా మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గా తనను తాను నిరూపించుకున్న పాపులర్ డైరెక్టర్. అతడిని కాదనడం సరికాదని కూడా అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎవరి కారణాలు వారికి ఉంటాయని కూడా మరో కోణంలో ఈ ఇన్సిడెంట్ ని కొందరు విశ్లేషిస్తున్నారు.



## పొట్టి దుస్తుల్లో జిల్లనిపించిన సారా టెండూల్కర్

చిట్టి పొట్టి దుస్తుల్లో హృదయాలను గాయపరిచే విద్య కేవలం సినిమా హీరోయిన్లకే సాధ్యమని అనుకుంటే పొరపాటే. ఇదిగో ఇక్కడ క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ పొట్టి దుస్తుల్లో హొయలు పోతుంటే యూత్ మతి చెడుతోంది. కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తూ సారా మరోసారి మీడియా హెడ్ లైన్స్ లోకొచ్చింది. క్రికెట్ గాడ్ వారసురాలిగా సహజంగానే సారాపై అందరి దృష్టి ఉంటుంది. ఇటీవల కమర్షియల్ ప్రకటనల్లో నటిస్తూ మోడల్ గా రాణిస్తున్న సారా టెండూల్కర్ మోడలింగ్ లో తన ప్రతిభతో ఆకర్షిస్తోంది. ఇప్పుడు మరోసారి ఓ ప్రకటనలో నటించేందుకు గ్లామరస్ దుస్తుల్లో దర్శనమిచ్చింది. టీనేజీ నుంచి మెచ్యూర్డ్ ఏజ్ లోకి అడుగుపెడుతున్న సారా అందచందాలు, రూపలావణ్యానికి యూత్ ఫిదా అయిపోయింది. సారా లాంటి అందగత్తె బాలీవుడ్ లో కథానాయికగా నటించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఒక బాలీవుడ్ హీరోయిన్ కి ఏమాత్రం తగ్గని క్రేజ్ సారాకు ఉంది. సోషల్ మీడియాల్లోను అసాధారణ ఫాలోయింగ్ ఉంది. సారా పరిశ్రమలోకి అడుగుపెట్టడానికి సరైన సమయమిదేనని అభిమానులు భావిస్తున్నారు. అయితే సారా మాత్రం కేవలం మోడలింగ్ వరకే పరిమితమైంది. నటన తనకు సూట్ కాదని, కెమెరా ముందు నిలబడటం తనకు చాలా కష్టమని చెప్పేసింది. కానీ సారాలో చురుకుదనం చూస్తుంటే, తన మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదనేది ఫ్యాన్స్ అభిప్రాయం. అందుకే ఇప్పుడు ఇలా పొట్టి స్కర్టులో ప్రత్యక్షమైన సారాను చూడగానే, యూత్ లో కల్లోలం మొదలైంది. ప్రఖ్యాత లూయీస్ వీట్టన్ హ్యాండ్ బ్యాగులు, పర్సుల కోసం ప్రకటనలో నటించిన సారా టెండూల్కర్ ఎంతో స్టైలిష్ గా కనిపిస్తోంది. అంతర్జాతీయ బ్రాండ్లను రెగ్యులర్ గా తన ఖాతాలో వేసుకుంటూ సారా భారీగానే ఆర్జిస్తోంది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com